

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట
గురువారం 20 జూన్ 2024







గిజిగాడి గూడు..
నైపుణ్యం చూడు..

గూడు నిర్మాణంలో గిజిగాడుకి ఎవరూ సాటిరారు అంటుంటారు.. ఎవరికీ అంతుచిక్కని రీతిలో గూళ్లు కట్టుకుని మెత్తని పాన్పులో సేదతీరుతుంటాయి. సిద్దిపేట పట్టణంలో కోమటిచెరువు సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలోని ఓ చెట్టుకు పిచ్చుకలు ఇలా గూడు కట్టుకొన్నాయి. స్థానికులకు ఇవి కనువిందు చేస్తున్నాయి.


- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





విద్యుత్ బిరబిరా..
మీటర్లు గిరగిరా

• గతేడాది 693.56 మిలియన్ యూనిట్ల వినియోగం
• ఈ ఏడాది 773.43 మిలియన్ యూనిట్ల వాడకం
• జిల్లాలో 1,81,365 మంది గృహజ్యోతి లబ్ధిదారులు
• మూడునెలల్లో 200 యూనిట్లు దాటిన లబ్ధిదారుల సంఖ్య 10,853
• ఎండల తీవ్రతకు పెరిగిన వినియోగం



సిద్దిపేట టౌన్, జూన్ 19: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో వేడి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లను అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో గత మూడునెలల నుంచి విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. గతేడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 693.56 మిలియన్ యునిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈ ఏడాది 773.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. మొత్తంగా 79.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.

గృహ వినియోగదారులు 3,06,080

సిద్దిపేట జిల్లాలో కేటగిరి-1 విభాగంలో 3,06,080 గృహ వినియోగదారులకు గాను జిల్లావ్యాప్తంగా 179 విద్యుత్ ఉపకేంద్రాలున్నాయి. దాదాపు 35 వేల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గృహ వినియోగదారులకు విద్యుత్‌ను అందిస్తున్నారు. ఎండాకాలంలో గతేడాది మార్చిలో 319.57 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్‌లో 261.32 మిలియన్ యూనిట్లు, మే లో 112.67 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఈ ఏడాది మార్చిలో 359.05 మిలియ న్ యూనిట్లు, ఏప్రిల్‌లో 271.06 మిలియన్ యూనిట్లు, మే నెలలో 143.32 మిలియన్ యూనిట్లు వినియోగించారు.

గృహజ్యోతి లబ్ధిదారులు 1,81,365

జిల్లావ్యాప్తంగా 3,06,080 గృహ వినియోగదారులుండగా అందులో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వినియోగించే 1,81,365 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారు. మార్చి 1 నుండి ప్రారంభమైన ఈ పథకంలో జిల్లాలో మే నెల వరకు 1,79,620 మంది లబ్ధిదారులుండేవారు. అయితే ఇటీవల ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో పెండింగ్‌లో ఉన్న గృహజ్యోతి దరఖాస్తులను పరిశీలించి మరికొందరిని అర్హులుగా గుర్తించారు. దీంతో మొత్తంగా ఆ సంఖ్య 1,81,365 చేరింది. వీరిలో ఏప్రిల్, మే నెలల్లో 200 యూనిట్లు దాటిన వారిలో 10,853 మంది గృహజ్యోతి లబ్ధిదారులున్నారు.

విద్యుత్ బిల్లు రూ. 14.64 కోట్లు

జిల్లాలో గృహవినియోగదారుల నుంచి అధికారులు గత మార్చి వరకు ప్రతినెలా రూ.14.64 కోట్ల విద్యుత్ బిల్లులను వసూలు చేశారు. గృహజ్యోతి పథకం ప్రారంభంతో 1,81,365 లబ్ధిదారులకు జీరో బిల్స్ వస్తున్నాయి. వీరిలో నుంచి దాదాపు 10 వేల మంది గృహజ్యోతి లబ్ధిదారులు 200 యూనిట్లకు మించి విద్యుత్‌ను వినియోగించడంతో బిల్లులను అందజేశారు. గృహజ్యోతి పథకానికి అర్హులు కానివారు 1,24,715 మంది నుంచి దాదాపు రూ. 8.54 కోట్లు వసూలు చేస్తున్నారు. గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్స్ ఇస్తుండటంతో వాటి బిల్లు దాదాపు రూ.6.10 కోట్లు మేర విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించనున్నది. అయితే వర్షాలకు కురిసి వాతావరణం చల్లబడితే విద్యుత్ వినియోగం కాస్త తగ్గే అవకాశం లేకపోలేదు.



సిద్దిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్

నులిపురుగులను నిర్మూలిద్దాం

• జిల్లాలోని 2,38,559 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి
• 20, 27న మాత్రల పంపిణీ : కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, జూన్ 19: నులిపురుగులను నిర్మూలించి, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామని సిద్దిపేట కలెక్టర్ ఎం.మను చౌదరి పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా ఆయన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 2,38,559 మంది ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ నెల 20న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు వేస్తారని తెలిపారు. 20న మాత్రలు తీసుకోని చిన్నారులకు 27న ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంలో విద్యాశాఖ, జిల్లా సంక్షేమశాఖ అధికారులతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, కళాశాలల్లో పిల్లలకు విధిగా ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో సంక్రమణ ప్రభావం వలన రక్తహీనత, చురుకుదనం, పోషకాహార లోపం, ఆకలి లేకపోవుడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరేచనాలు లాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయని తెలిపారు. దీనివలన పిల్లలు ఏకాగ్రత కోల్పోతారని, పని సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని రకాలుగా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉందని, క్షేత్రస్థాయిలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ కిషోర్‌కుమార్ వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, వైద్యులు రజిని, శ్రీదేవి, వినోద్‌బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

• సీపీ డాక్టర్ బి.అనురాధ



సిద్దిపేట క్రైం, జూన్ 19 : జిల్లాలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ బుధవారం తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలు గుర్తించడంలో శిక్షణ పొందిన నార్కోటిక్స్ డాగ్స్ ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్, ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మే, కొనే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిసినా, రవాణా చేస్తున్నట్లు తెలిసినా 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం వాట్సాప్ నంబర్ 8712667100 కాల్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వాటి పేర్లు గోప్యంగా ఉంచడంతోపాటు రివార్డు కూడా అందజేస్తామని సీపీ తెలిపారు.



బెజ్జంకి : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

• కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బెజ్జంకి/కోహెడ/ములుగు, జూన్ 19 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కరీంనగర్ వెళ్తున్న ఎంపీ బండి సంజయ్‌కు సిద్దిపేట జిల్లాలో ఘన స్వాగతం లభించింది. బెజ్జంకి మండలం రేగులపల్లి రాజీవ్ రహదారి వద్దకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. బండి సంజయ్‌కి గజమాల వేసి, పుష్పగుచ్ఛాలను అందించారు. నాయకులు, కార్యకర్తలకు బండిసంజయ్ అభివాదం చేస్తూ జై శ్రీరామ్.. అంటూ నినాదించారు. అలాగే, కోహెడ మండలం శనిగరం వద్ద, ములుగు మండలం వంటిమామిడి వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బండి సంజయ్‌కు ములుగు బీజేపీ మండలాధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, జిల్లా నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, చిరంజీవి యాదవ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ తలపై టోపీ పెట్టి శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో కరీంనగర్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులు, బెజ్జంకి, కోహెడ, ఇల్లంతకుంట, చిన్నకోడూరు, గన్నేరువరం మండలాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, ఖమ్మం వెంకటేశం, పిల్లి నరసయ్య, బండ జగన్, రజనీకాంత్‌రెడ్డి, రమేష్, ఎంపీటీసీలు స్వరూప, నర్సయ్య, మర్కుక్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీకాంత్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే అండర్‌పాస్ నిర్మాణం

• నెలరోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

చేర్యాల, జూన్ 19 : కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా కొమురవెల్లి శివారులోని రైల్వేగేట్ ఆవరణలో కొన్నినెలల క్రితం చేపట్టిన అండర్‌పాస్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ముందస్తుగా కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ప్రతిపాదన లేకపోవడం, గ్రామశివారులో రైల్వేగేట్‌కే పరిమితం కావడంతో మల్లన్న భక్తులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో ఇక్కడ హాల్ట్‌స్టేషన్ మంజూరైంది. మల్లన్న భక్తులతో పాటు ప్రయాణికులు ఈదారి వెంబడి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతుంది. రోడ్డుమీదుగా ట్రాక్ నిర్మాణం జరగడంతో ట్రాఫిక్‌జాం కావడంతో పాటు వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. దీంతో అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అందుకు గతంలో ఉన్న రోడ్డును తవ్వి రిటైనింగ్ వాల్, సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు సుమారు రూ.4కోట్ల వ్యయంతో గతేడాది పనులు ప్రారంభించారు. రిటైనింగ్ వాల్‌తో పాటు సీసీ పనులు ఇంకా మిగిలి ఉన్నాయి. ఆ పనులు పూర్తవడానికి ఇంకా నెలరోజులు పట్టే అవకాశాలున్నాయి. పక్కదారి నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో దుమ్ము, ధూళి వెదజల్లుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచి చిత్తడిగా మారడంతో పాటు వాహనాలు దిగబడుతుండటంతో తంటాలుపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనుల్లో జాప్యం జరగకుండా నాణ్యత, ప్రమాణాలతో చేపట్టి త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కొమురవెల్లి శివారులోని రైల్వేగేట్ వద్ద చేపడుతున్న అండర్‌పాస్ పనులు



నిర్మాణంలో అండర్‌పాస్ సీసీ ఫ్లోర్

నెలరోజుల్లో అందుబాటులోకి..

- జనార్దన్, డీఈ

పూలింగ్ పద్ధతిలో అండర్‌పాస్ నిర్మాణ పనులు చేపడుతున్నాం. రిటైనింగ్ వాల్, సీసీ ఫ్లోరింగ్ పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. పూర్తి క్యూరింగ్ చేసి సుమారు నెలరోజుల్లో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.



కలెక్టరేట్‌లో శునకాల స్వైరవిహారం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం సిద్దిపేట జిల్లా నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారు. కాగా కార్యాలయంలోని రెండవ ఫ్లోర్‌లో శునకాలు ఉండటంతో ప్రజలు అటు వెళ్లాలంటేనే జంకుతున్నారు. నిత్యం ఉద్యోగులు, సిబ్బందితో పాటు బిజీబిజీగా ఉండే కలెక్టర్ కార్యాలయంలో శునకాలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- సిద్దిపేట టౌన్, జూన్19



కోర్టు ప్రాంగణంలో వీడబ్ల్యూడీసీ సెంటర్ ప్రారంభం

• సాక్షులను కాపాడటమే ముఖ్య ఉద్దేశం
• జిల్లా న్యాయాధికారి సాయి రమాదేవి

సిద్దిపేట క్రైం, జూన్ 19 : మైనర్లు, మానసిక దివ్యాంగులు, ప్రాణహాని ఉన్న సాక్షుల సౌకర్యార్థం సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీడబ్ల్యూడీసీ సెంటర్‌ను బుధవారం జిల్లా న్యాయాధికారి సాయి రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్రకు చెందిన ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశానుసారం ప్రతి జిల్లాలో వీడబ్ల్యూడీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, అందులో భాగంగానే సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో కూడా ప్రారంభించామని తెలిపారు. కోర్టుకు వచ్చే సాక్షుల సౌకర్యం, వారిని కాపాడడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అంతకన్నా ముందు ఇతర న్యాయమూర్తులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, చందన, మిలింది కాంబ్లీ, శ్రావణి యాదవ్, ఏసీపీ మధు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు పత్రిశ్రీప్రకాష్, రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి సాయి రమాదేవి, తదితరులు














కోళ్ల వ్యర్థాలు యథేచ్ఛగా చెరువులోకి..

● కుక్కల స్వైరవిహారంతో గ్రామస్థుల ఆందోళన



కుకునూరుపల్లి, జూన్ 19: మండల కేంద్రంలోని చెరువులో కోళ్ల వ్యర్థాలను యథేచ్ఛగా పారబోయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో చికెన్‌షాప్ యాజమానులు కోళ్ల వ్యర్థాలను గ్రామంలోని కల్యాలమ్మ చెరువుగట్టుపై, చెరువులో పారబోయడంతో నీరు కలుషితం అవుతున్నది. అంతేగాకుండా కుక్కల బెడద ఎక్కువైంది. కోళ్ల వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా చెరువు గట్టుపై చేరి అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారులపై దాడి చేయడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయంపూట చెరువు గట్టుపై వాకింగ్‌కి వెళ్లిన కొందరిని గాయపరిచిన ఘటనలు కూడా ఉన్నాయి. గత వారం జరిగిన గ్రామ సభలో పలువురు గ్రామస్థులు ఈ విషయమై ఫిర్యాదు కూడా చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని ఈ విషయమై వివరణ కోరగా చెరువుల్లో కోళ్ల వ్యర్థాలను వేస్తున్న షాపు యజమానులకు త్వరలో నోటీసులు అందజేయనున్నట్టు తెలిపారు.

ఫుడ్ కల్తీ చేస్తే చర్యలు

సంగారెడ్డి రూరల్, జూన్ 19: ఫుడ్ కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ వ్యాపారులను హెచ్చరించారు. సంగారెడ్డిలో బుధవారం పలు హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. కలెక్టర్ క్రాంతి ఆదేశానుసారం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాసిరకం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ హోటళ్లలో తనిఖీలు చేయగా ఫుడ్ లైసెన్స్ ప్రదర్శించడం లేదని గుర్తించామన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



సంగారెడ్డిలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే

● డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి



సంగారెడ్డిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 19: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.గాయత్రీదేవి అన్నారు. సంగారెడ్డిలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటి వరకు 147 స్కానింగ్ కేంద్రాలు అనుమతితో నడుస్తున్నాయని, ఐదు కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెన్యూవల్ కోసం మరో ఆరు సెంటర్ల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్టయితే వారికి 3 నుంచి 5 ఏళ్లవరకు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు డా.సంగారెడ్డి, డా.సుధారాణి, డా.శశాంక్, డా.మనోహర్‌రెడ్డి, డా.రాజుగౌడ్, వనజారెడ్డి, పల్లవి, చందర్, ప్రసాద్, వీర్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి

గజ్వేల్, జూన్ 19: ప్రజలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు ఎన్నో హామీలను రేవంత్‌రెడ్డి ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక అన్నింటిని విస్మరించారన్నారు. గృహజ్యోతి పథకంతో 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం వాటి అమలు తీరుపై సమీక్ష నిర్వహించడంలో విఫలమైందన్నారు. గ్యాస్ డబ్బులు జమ, ఉచిత విద్యుత్ అందక వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు.




గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు











'నులి'పేద్దాం



- నేడు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు
- 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు మందులు పంపిణీ

కొండపాక, జూన్ 19 : పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించేందుకు, పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఏటా జూన్ 20న జాతీయ నులి పురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నారు. ఆ రోజున పిల్లలను నులి పురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) అందజేస్తారు. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు పూర్తి చేశారు. గురువారం మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 27న మాత్రలు అందజేయాలని నిర్ణయించారు.

వయసుల వారీగా..

పిల్లల వయస్సుల వారీగా ఆల్బెండజోల్ డోస్ అందిస్తారు. 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు 400ఎంజీలో సగం 200 ఎంజీ మాత్రను వేసుకోవాలి. మిగతా వారు 400 ఎంజీ మాత్రను వేసుకోవాలి. మాత్రను బాగా నమలాలి. అల్పాహారం లేదా భోజనం చేసినవారికే ఈ ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వాలని, ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఎట్టి పరిస్థితిల్లో ఇవ్వరాదని వైద్యులు సూచించారు.

అపరిశుభ్రతతో నులిపురుగులు

అపరిశుభ్రతతోనే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. నులిపురుగులు రాకుండా ఉండాలంటే చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోర్లు పెరిగినప్పుడు వాటిని కత్తిరించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల వాటిలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతారు. అలాగే, పరిశుభ్రమైన నీరు తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుకోవాలి. కూరగాయాలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎల్లప్పుడు మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగుల వల్ల అనర్థాలు

నులిపురుగుల వల్ల పిల్లల్లో ఆనారోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారిలో నులిపురుగులు ఉంటే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. నులి పురుగులనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత నియంత్రణ, పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనాలు కలుగజేస్తుంది.



అవగాహన కార్యక్రమాలు

ఆల్బెండజోల్ మాత్రలను వేయడం కోసం అన్ని మండల కేంద్రాల్లో వైద్య సిబ్బంది ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. అలాగే, గురువారం నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.



సంగారెడ్డికి మెట్రో రైల్ తెస్తా..

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు



రఘునందన్‌రావు, బీజేపీ నేత రాజేశ్వర్ దేశ్‌పాండేలను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి క్రైం, జూన్ 19: మెట్రో రైలును మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. బీజేపీ సంగారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి అభినందన, సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ సంగారెడ్డి చౌరస్తా వరకు మెట్రో రైలు తప్పకుండా తెస్తానని హామీఇచ్చారు. ఈ విషయంలో త్వరలో మెట్రో సీఎండీని కలుస్తానన్నారు. గత ప్రభుత్వాలు సంగారెడ్డి వరకు మెట్రో రైలు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జగ్గారెడ్డి ఈ విషయంలో కనీసం ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపించారు. సిద్దిపేటకు రైలు ఎలా వస్తుంది? సంగారెడ్డికి మెట్రో ఎందుకు తీసుకురాలేదని ఆయన బీఆర్‌ఎస్ నేతలను ధ్వజమెత్తారు. అయితే గతంలో సంగారెడ్డి బీజేపీకి అడ్డాగా ఉండేదని, గతంలో మూడుసార్లు సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు బీజేపీయే దక్కించుకుందని, గత స్ఫూర్తితోనే ఈ సారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యమకారులకు ద్రోహం చేసిన బీఆర్‌ఎస్

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారులను బీఆర్‌ఎస్ ద్రోహం చేసిందని రఘునందన్‌రావు విమర్శించారు. ఈ కారణంగా గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైందని అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ఎంపీని సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, నాయకులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా హక్కులను సాధిస్తా

పటాన్‌చెరు, జూన్ 19: మెదక్ లోక్‌సభ స్థానం నుంచి చరిత్రాత్మక విజయం సాధించడంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అపూర్వమని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పటాన్‌చెరు పాటి చౌరస్తాలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. అధికారంతో విర్రవీగిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మెదక్ ప్రజల ఓట్ల సునామీలో కొట్టుకుపోయారన్నారు. పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్‌కు ఐదురుగు ఎమ్మెల్యేలు ఉన్నా వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. అనంతరం రైతులకు కిసాన్ సమ్మాన్ పథకం కింద రూ.20వేల కోట్లు విడుదల చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు పటాన్‌చెరులో ఎంపీ రఘునందన్‌రావుకు కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికి, భారీ ర్యాలీ నిర్వహించారు. అభినందన సభలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, ఆదెల్లి రవీందర్, రమేష్, గిద్దె రాజు, కే.రాజశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కడవేరుగు శివారులో కారు-ఆటో ఢీ

- 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులు

చేర్యాల, జూన్ 19 : చేర్యాల మండలం కడవేరుగు గ్రామశివారులోని పెట్రోల్‌పంప్ సమీపంలో బుధవారం రాత్రి కారు, ఆటో ఢీ కొన్న ఘటనలో మద్దూరు మండలం గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన సుమారు 15మంది గాయాల పాలయ్యారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ఠాపన వేడుకలు జరుగుతున్నాయి. గాగిళ్లాపూర్‌కు చెందిన ముక్క స్వరూప, ముక్క లక్ష్మీ, ఏలూరి పోచవ్వ, ముక్క భారతమ్మ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మ తదితరులు ఇంటిల్లిపాదిగా పోతిరెడ్డిపల్లిలోని తమ బంధువుల ఇంటికివెళ్లి వేడుకలకు హాజరయ్యారు. అందరు కలిసి రాత్రి ఆటోలో ఇంటికి తిరిగివస్తుండగా, మార్గంమధ్యలోని పెట్రోల్‌పంప్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తాపడటంతో అందరికీ గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు గమనించి 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. గాయాల పాలైనవారి సంఖ్య అధికంగా ఉండటంతో



తీవ్ర గాయాలపాలైన మహిళలు

ప్రైవేటు అంబులెన్సుల ద్వారా చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు, సిబ్బంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. గాయపడిన వారిలో ముక్క స్వరూప, ముక్క లక్ష్మీ, ముక్క భారతమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతోపాటు ఏలూరి పోచవ్వ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మలను మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తరలించారు. మిగతా వారికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. ఇంటిల్లిపాది కుటుంబసభ్యులు రోడ్డుప్రమాదానికి గురికావడంతో స్థానికులు, బంధువులు ఆస్పత్రికి తరలివచ్చారు.



ఫిలిప్పీన్స్ వెళ్లి ఆరేళ్లు..

- అప్పటి నుంచి అతని ఆచూకీ గల్లంతు..
- ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి ఆందోళన
- ఎస్పీకి ఫిర్యాదు.. గుర్తించిన సంగారెడ్డి పోలీసులు
- కొడుకుతో ఫోన్‌లో మాట్లాడిన తల్లి
- నెలరోజుల్లో అతను తిరిగివచ్చేలా చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 19: ఎంబీబీఎస్ చదివేందుకు అతను ఫిలిప్పీన్స్ వెళ్లాడు. తండ్రి మరణించిన సమయంలో ఓసారి ఇంటికి వచ్చి వెళ్లాడు. ఆ తర్వాత ఆరేళ్లుగా అతని ఆచూకీ లేదు. తల్లి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. సంగారెడ్డి పోలీసులు అతని ఆచూకీ కనుగొని ఆమెతో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రానికి చెందిన సత్యగామ మాణమ్మ కుమారుడు అరుణ్‌రెడ్డి (31).. 2012లో ఎంబీబీఎస్ చదివేందుకు ఫిలిప్పీన్స్ దేశం వెళ్లాడు. 2018లో తండ్రి వెంకట్‌రాంరెడ్డి మరణం అనంతరం ఇంటికి వచ్చి అదే ఏడాది తిరిగి ఫిలిప్పీన్స్ వెళ్లాడు. ఆరేళ్లయినా ఇంటికి రాకపోవడం, కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి మాణమ్మ ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ చెన్నూరి రూపేష్ అతని ఆచూకీ తెలుసుకోవాలని ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఫోన్ నంబరు, ఫొటోలు తదితర వివరాలతో ఫిలిప్పీన్స్ ఎంబసీతో మాట్లాడారు. అరుణ్ ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి మాణమ్మతో మాట్లాడించారు. దీంతో ఆమె ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఇతర ధ్రువపత్రాలు పోగొట్టుకున్నాడని, భయంతో తల్లికి ఫోన్ చేయలేకపోయాడని ఎస్పీ రూపేష్ తెలిపారు. నెలరోజుల్లో అరుణ్‌రెడ్డి కందికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అరుణ్ ఎంబీబీఎస్ పూర్తి చేసినా పాస్‌పోర్టు పోగొట్టుకోవడంతో స్వదేశానికి రాలేక అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.


గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపులు

- వర్గాలుగా రాహుల్ జన్మదిన వేడుకలు



గజ్వేల్‌లోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జూన్ 19: గజ్వేల్ పట్టణ కాంగ్రెస్‌లో వర్గపోరు బహిర్గతమైంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఇక్కడి నాయకులు వర్గాలుగా విడిపోయి వేడుకలు జరుపుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, టీపీసీసీ నాయకులు గోపాల్‌రావు, యాదగిరి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మోహన్నగారి రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు ఫాంహౌజ్‌లో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మునిసిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, నక్క రాములు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఇందిరాపార్కు చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. ఇలా ఇరువర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

సిద్దిపేట అర్బన్, జూన్ 19: సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలోని దాబా పక్కన ఉన్న పాన్‌షాప్‌లో నిషేధిత గుట్కాలను బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగధాంపల్లి చౌరస్తాలో మహ్మద్ హమీద్ దాబా పక్కన పాన్‌షాప్‌లో గుట్కాలు, అంబర్ అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారంతో ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రూ.8 వేల విలువ చేసే గుట్కాలు, టొబాకో ప్యాకెట్లు సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

24న హుస్నాబాద్‌లో మెగా జాబ్ మేళా

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 19: ఈ నెల 24న హుస్నాబాద్ పట్టణంలో యువజన సర్వీసుల శాఖ ద్వారా నిర్వహించే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మను చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 60 కి పైగా వివిధ కంపెనీలు 5వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హుస్నాబాద్ పట్టణంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు, కనీస విద్యార్హత 7వ తరగతి ఉండాలన్నారు. అన్ని రకాల విద్యార్హతలు కలిగినవారు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను పొందాలని కలెక్టర్ తెలిపారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, జూన్ 19: జాతీయ నులిపురుగు దినోత్సవాన్ని పురస్కరించుకుని మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏడాది వయస్సు నుంచి 19 సంవత్సరాల లోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి నిఖిత బుధవారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్సియల్ కళాశాలల్లో ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 19 ఏళ్ల వయస్సు లోపు వారందరికీ ఈ మాత్రలు వేయించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

● మద్దూరు, జూన్ 19 : నేడు మండలంలో నిర్వహించే నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు రజిత, స్టువర్ట్‌సన్ తెలిపారు. మద్దూరు పీహెచ్‌సీ పరిధిలో 2,700, లద్నూరు పీహెచ్‌సీ పరిధిలో 3,315 మంది ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్నవారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

సరైన వర్షపాతం ఉంటేనే 'పత్తి' విత్తుకోవాలి

మద్దూరు,జూన్ 19 : సరైన వర్షపాతం నమోదైతేనే పత్తి విత్తనాలు విత్తుకోవాలని ఏవో రామకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ధర్మారం, సలాఖ్‌పూర్ గ్రామాల్లో రైతులు వేసుకున్న పత్తి పంటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కొద్దిపాటి జల్లులకే విత్తనాలు విత్తుకోరాదన్నారు. 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతేనే పత్తి విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూమిలో వేడికి విత్తుకున్న పత్తి విత్తనాలు మొలకలు రావని వివరించారు. రైతులకు సరపడా పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవో అఖిల్‌తో పాటు రైతులు ఉన్నారు.

అధిక సాంద్రత పత్తి క్షేత్రాల సందర్శన

జగదేవ్‌పూర్, జూన్ 19: మండలంలోని లింగారెడ్డిపల్లిలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేస్తున్న క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అధిక సాంద్రత పద్దతిలో పత్తి పంటను చెలక భూముల్లో సాగుచేయాలని వరుసకు వరుసకు మధ్య దూరం 90 సెంటీమీటర్లు, వరుసలో మొక్కకి మొక్కకి 15 సెంటీమీటర్లు ఉండేలా విత్తుకోవాలన్నారు. అలాగే ఎకరానికి రాశి స్విఫ్ట్ లేదా రాశి


మద్దూరు మండలం ధర్మారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో


జగదేవ్‌పూర్ లింగారెడ్డిపల్లిలో పత్తిసాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆర్‌సీహెచ్ 929 అనే రకాలను ఆరు ప్యాకెట్ల వరకు విత్తుకోవాలని సూచించారు. వర్షాధార భూముల్లో మాత్రమే అధిక సాంద్రత పత్తిని విత్తుకోవాలని, డ్రిప్ ఇరిగేషన్ ఉండకూడదని, నల్లరేగడి భూముల్లో అధిక సాంద్రత పత్తిని సాగు చేయరాదన్నారు. ఈ సూచనలు పాటించిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.6,700 చొప్పున సబ్సిడీ మంజూరు చేస్తుందని, ఐదు ఎకరాల లోపు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని అలాగే సొంత భూమిలో అధిక సాంద్రత పద్దతిలో పత్తి సాగు చేసే రైతులు మాత్రమే ఈ సబ్సిడీకి అర్హులని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 80 ఎకరాల వరకు ఈ అధిక సాంద్రత పద్దతిలో సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. సమత, రాశి సీడ్స్ కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం అధిక సాంద్రత పత్తి పర్యవేక్షణ అధికారులు సంతోష్, రైతులు చిక్కుడు నాగరాజు, చెక్కల స్వామి తదితరులు పాల్గొన్నారు.

నారుమడిలో సస్యరక్షణ తప్పనిసరి

చేర్యాల, జూన్ 19 : వరి నారుమడి దశలోనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కొమురవెల్లి వ్యవసాయాధికారి నరేశ్ అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో వరి పొలాలు పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరా నారుమడికి ఒక కిలో యూరియా, కిలో పొటాష్ వాడాలని, మోగిపురుగు ఆశిస్తే మడికి 400గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ చల్లుకోవాలని, కలుపు నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం మందును లీటర్ నీటిలో 0.5ఎంఎల్ కలిపి విత్తిన 8-10రోజుల సమయంలో పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం జీలుగ సాగును సందర్శించారు. 50శాతం పూతదశలోనే జీలుగను నేలలో కలియదున్నాలని, తద్వారా భూసారం పెరిగి చౌడు శాతం తగ్గుతుందని వివరించారు.

ఉచితంగా బ్యూటీషన్ కోర్సు

సిద్దిపేట అర్బన్, జూన్ 19 : సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామీణ మహిళలందరికీ ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యూటీషన్ కోర్సును అందిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షురాలు వడ్డేపల్లి స్వరూపరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం 30 రోజుల్లోనే కోర్సు పూర్తవుతుందని, శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఇంటి వద్దనే ఉంటూ స్వయం ఉపాధి పొందడానికి ఇది చక్కని అవకాశమని, ఆసక్తి గల మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు ఆధార్ జిరాక్స్, ఫొటోలతో దేవినిలయం, ప్రగతి కోచింగ్ సెంటర్ మొదటి అంతస్తు, సిద్దిపేట పాతబస్టాండ్ సమీపంలోని గోల్డెన్ బేకరీ పక్క వీధిలోగల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9885885262కు సంప్రదించాలని తెలిపారు.

కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు, జూన్ 19 : మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో కేర్‌టేకర్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో యాదవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేసి, కంప్యూటర్ నాలెడ్జ్ కల్గి ఉండాలని తెలిపారు. ఈ నెల 20 నుంచి 26 తేదీ వరకు దరఖాస్తులను పాఠశాలలోని బాలికల హాస్టల్‌లో సమర్పించాలని ఆయన సూచించారు.

బెజ్జంకి కేజీబీవీలో నైట్ వాచ్‌మన్ పోస్టుకు..

బెజ్జంకి, జూన్ 19: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ పోస్టుకు జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు అర్హులైన మహిళా అభ్యర్థులను నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో యాదవరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, 10వ తరగతి విద్యార్హతతో మండలానికి చెందినవారై ఉండాలని తెలిపారు. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని కోరారు.

కొండపాక కేజీబీవీలో..

కొండపాక, జూన్ 19: కొండపాక మండలం కేజీబీవీ పాఠశాలలో ఒక మహిళా వాచ్‌మన్‌తో పాటు ఒక అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కొండపాక ఎంఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాచ్‌మన్ పోస్టుకు అభ్యర్థులు 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి, 10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు కొండపాక మండలానికి చెందినవారై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు మండలంలోని కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు ఈ నెల 19 నుంచి 23వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. అలాగే అసిస్టెంట్ కుక్ పోస్టుకు అభ్యర్థులు 7వ తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి అర్హత గల వారు మండలంలోని టీఎస్ఎంఎస్ బాలికల హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు ఈ నెల 19నుండి 23వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

108 వాహనాల ఆకస్మిక తనిఖీ


కన్నారెడ్డికి అవార్డును అందజేస్తున్నదృశ్యం

గజ్వేల్, జూన్ 19: గజ్వేల్ పట్టణంలోని 108, 1029, 1962 వాహనాలను ఉమ్మడి మెదక్ జిల్లా గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేసిన అనంతరం పలు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం 1962లో సిద్దిపేట జిల్లా ఉత్తమ పైలట్‌గా అవార్డును అందుకున్న కన్నారెడ్డికి అవార్డును అందజేశారు. ఆయనవెంట ఎఫ్‌హెచ్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీపీ

మర్కుక్, జూన్ 19: మండలంలోని పాములపర్తి గ్రామంలో మ్యాకల లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎంపీపీ పాండుగౌడ్ బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండల బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్, జుట్టు సుధాకర్, శ్రీనివాస్, కరుణాకర్, లక్ష్మణ్, ఎల్లం, రాజు, స్వామి, డెవిడ్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, జూన్ 19: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని గిరిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. గిరిపల్లి గ్రామానికి చెందిన మద్దికుంట లక్ష్మయ్య(51) గతేడాది తన 2.5ఎకరాల వ్యవసాయ భూమితో పాటు మరో 5ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయగా, పంట సరిగా పండకపోవడంతో పెట్టుబడి పెరిగి దాదాపు రూ. 2లక్షల వరకు అప్పులైనట్లు కుటుంబీకులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం లేక పోవడంతో లక్ష్మయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 17న వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక బిళ్లలు మింగాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా, లక్ష్మయ్య అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే లక్ష్మయ్యను గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి లక్ష్మయ్య మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

దుబ్బాక, జూన్ 19: మండలంలోని అప్పనపల్లి గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన కుమ్మరి సత్తయ్య అనే వ్యక్తి అప్పనపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. గ్రామంలో కాళ్లకృత్యాలను తీర్చుకోవడానికి బావి వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడు. ఈ విషయాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈతగాళ్ల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కుకునూరుపల్లి, జూన్ 19: మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం గజ్వేల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమరంభీమ్ జిల్లా ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామానికి చెందిన ఆడే తిరుపతి(45), అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కారులో గ్రామం నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి వెళ్లి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొడకండ్ల గ్రామ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కారు ఒక్కసారిగా టిప్పర్ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బుధవారం ఉదయం చికిత్స పొందుతూ ఆడే తిరుపతి మరణించాడు. మిగతావారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మోడల్ గృహాన్ని పరిశీలించిన ఎంపీడీవో



ఇందిరమ్మ మోడల్ గృహాన్ని, రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మద్దూరు, జూన్ 19 : 'శిథిలమైపోతున్న ఇందిరమ్మ నమూనా గృహం' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రాంమోహన్ స్పందించారు. ఈ మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ గృహాన్ని సందర్శించి పరిశీలించారు. 2016లో పనిచేసిన హౌజింగ్ అధికారుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్నారు. గత ప్రభుత్వం హౌసింగ్‌శాఖను క్లోజ్ చేసిందని, ఔట్‌సోర్సింగ్ ద్వారా పని చేసిన వారిని తొలగించడంతో చేర్యాలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఈలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం ఆశాఖ వారు ఇతర డిపార్టుమెంట్లకు వెళ్లడంతో మండల పరిధిలోని పీఆర్ డిపార్టుమెంట్‌కు అప్పగించినట్లు తెలిపారు. అప్పటి లబ్ధిదారుల డాక్యుమెంట్స్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారన్నారు. నమూనా గృహంలో ఉన్న రికార్డులు, ఫర్నిచర్‌ను భద్రంగా ఉంచడంతో పాటు చెదలుపట్టిన తలుపులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి నమూనా గృహాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి అటెండర్ రమేష్ ఉన్నారు.

'సపాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

మిరుదొడ్డి, జూన్ 19:రాష్ట్ర ప్రభుత్వం సపాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మిరుదొడ్డి గ్రామపంచాయతీ ఎదుట సపాయి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 7 నెలల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు రాకపోవడం కుటుంబపోషణ భారంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి: ఎంపీడీవో

మర్కుక్, జూన్ 19: ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో అబ్జలుద్దీన్ పేర్కొన్నారు. మర్కుక్ మండల పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం మండల ఎంపీడీవో అబ్జలుద్దీన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, కనీసం 5 నీటి నిల్వ తొట్లు, 2 ఫిష్ పాండ్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల పూడిక ఆపేసి ల్యాండ్ లెవెలింగ్ చేయాలని, శుక్రవారం కచ్చితంగా డ్రై డేను పాటిస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి తప్పకుండా అన్ని రికార్డులు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజలింగం, టీఏ స్వామి, పంచాయతీ కార్యదర్శులు సిద్దేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, శైలేష్, ప్రవీణ్, మౌన, శృతి, రేఖ, నీలిమ, సంగీత తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న దోస్త్ అడ్మిషన్లు

● ప్రారంభమైన మూడో కౌన్సెలింగ్

సిద్దిపేట క్రైం, జూన్ 19 : గత నెల మూడో తేదీన ప్రభుత్వం దోస్త్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసినదే. ఇప్పటి వరకు రెండు విడతల్లో కౌన్సెలింగ్ పూర్తయింది. బుధవారం నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కొంతమంది డిగ్రీ అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 9ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 23 ప్రైవేట్ కళాశాలలు ఉండగా రెండు విడతల్లో ఇప్పటివరకు సుమారు 2,200 మంది అడ్మిషన్ పొందారు. విద్యార్థులు తమకు నచ్చిన డిగ్రీ కాలేజీలలో ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోగా మెరిట్ ఆధారంగా తమ గ్రూపులకు కాలేజీలలో ప్రభుత్వం అలాట్ చేస్తున్నది. వచ్చే నెల 2 వరకు మూడో విడత కౌన్సెలింగ్ జరగనున్నది.

మాజీ సర్పంచ్‌లకు సన్మానం


సింగన్నగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న వైద్యులు

ములుగు, జూన్ 19: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక బాధ్యత ఉంటుందని ఎంపీపీ లావణ్య అంజన్నగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సింగన్నగూడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సింగన్నగూడ, కొక్కొండ గ్రామాల మాజీ సర్పంచ్‌లను సన్మానించారు.

మృతుడి కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, జూన్ 19: మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన పురుషుల పొదుపు సంఘం సభ్యుడు దండుగుల కొంరెల్లి ఇటీవల మరణించగా అతడి కుటుంబానికి పొదుపు సంఘం ద్వారా రూ. 60 వేల విలువైన ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాలక వర్గం అధ్యక్షుడు, సభ్యులు ఉన్నారు.

ఓపెన్‌జిమ్ ఆవరణలో మందుబాబుల ఆగడాలు


చీపుర్లతో శుభ్రం చేస్తున్న వాకర్స్

చేర్యాల, జూన్ 19 : చేర్యాల పెద్దచెరువుకట్టపై ఓపెన్‌జిమ్ ఆవరణలో మందుబాబులు ఆగడాలు మితిమీరుతున్నాయి. రాత్రివేళల్లో మద్యం తాగి సీసాలు పగులగొట్టి ప్లాట్‌ఫామ్‌పై పారబోస్తుండటంతో ప్రజలు, వాకర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ప్లాట్‌ఫామ్‌పై చెత్త, చెదారం, వ్యర్థాలు పేరుకుపోతున్నా శుభ్రపరచడంలో మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో వాకర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ సిబ్బందికి తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం ఉదయం ఓపెన్‌జిమ్ ప్లాట్‌ఫామ్‌ను వాకర్స్ చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. గతంలో మునిసిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ నిత్యం చెరువుకట్టను పర్యవేక్షించడంతో ఓపెన్‌జిమ్‌ను శుభ్రంచేయించేవారు. ఆయన బదిలీపై వెళ్లినప్పటి నుంచి జిమ్‌ప్లాట్‌ఫాంను పట్టించుకున్ననాథుడేలేకపోవడంతో మునిసిపల్ అధికారుల తీరుపై వాకర్స్, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్వీఎం నర్సింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు, జూన్ 19: ఆర్వీఎం నర్సింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడబోయిన మమత, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ ఆర్వీఎం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులు విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టడంలేదని, ఎక్కువ సమయం క్లాసులకు కాకుండా హాస్పిటల్‌లో పని చేయిస్తున్నారని, పబ్లిక్ సెలవులు పెనాల్టీ పేరుతో డబ్బులు వసూలు చేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సీఈవో శ్రీనివాస్‌రావుతో మాట్లాడగా 10 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆముదా రంజిత్‌రెడ్డి, జిల్లాకమిటీ సభ్యులు కోనేరు ప్రవీణ్, అత్తిని హారిక, తాడూరి భరత్‌కుమార్, వేముల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

● జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించిన పలు విద్యార్థి సంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 19 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ విమర్శించారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రైవేట్ విద్యాసంస్థలను అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, యూనిఫామ్ పుస్తకాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, నవీన్, అనిరుద్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్వీ

విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనల ఉల్లంఘిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలోని జిల్లా విద్యాధికారి కార్యాలయంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలలో చదువు అందని ద్రాక్షగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం


అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

నాయకులు యాదగిరి, శ్యామ్, మహిపాల్, శ్రీకాంత్ ,రాజు ,మధు, సతీష్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 19 : జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అంబాల రమేష్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని ధిక్కరించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 చట్టాన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఎందుకు అమలు పరచడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో డీఎస్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ రజాక్, పట్టణ కార్యదర్శి రంజాన్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు లక్ష్మి, సహాయ కార్యదర్శి సతీష్, ఎండీ గౌస్, గడ్డం ప్రసాద్, భాసంగారి అంజయ్య, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు

కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో పార్టీ నాయకులు రాహుల్ జన్మదిన కేక్‌లను కట్ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

సిద్దిపేట టౌన్, జూన్ 19: సిద్దిపేట పట్టణంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, గంప మహేందర్, కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు ముద్దం లక్ష్మి, బుచ్చిరెడ్డి, తప్పెట శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జంగోని శ్రీనివాస్, మోతె కుమారస్వామి, గిరిపల్లి వెంకటి, బంక చిరంజీవి యాదవ్ పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ రూరల్:** హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, పున్న లావణ్య, తదితరులు ఉన్నారు. అదేవిధంగా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

● **చేర్యాల:** పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మంచాల చిరంజీవులు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, ముస్త్యాల కిష్టయ్య, ఆడెపు చంద్రయ్య, ఆడెపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజ గోపుర ఆవరణలో కాంగ్రెస్ మండల నాయకులు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, యువజన అధ్యక్షులు, పరశురాములు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లికార్జున్, మైనార్టీ అధ్యక్షుడు ఆరిఫ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసం నవీన్, పీఎసీఎస్ డైరెక్టర్ నరసింహాచారి, కందూరి ఐలయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పులి కృష్ణ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో


హుస్నాబాద్‌లో రాహుల్ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పండ్లు పంపిణీ చేశారు.

● **మద్దూరు:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, జిల్లా నాయకుడు కామిడి జీవన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● **అక్కన్నపేట:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, నాయకులు బానోతు భాస్కర్ నాయక్, పొంద్రాల దాము, తదితరులు ఉన్నారు.

● **ధూళిమిట్ట:** దూళిమిట్ట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్ గౌడ్, నాయకులు సుద్దాల నర్సింహులు, కనకరాములు తదితరులు పాల్గొన్నారు.

● **ములుగు:** మండల కేంద్రంలో గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు, క్రీడా సామగ్రి అందజేత


విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాములుగౌడ్

మర్కుక్, జూన్ 19: గ్రామంలోని స్టార్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాముగౌడ్, గాయత్రి దంపతులు తమ కుమార్తె సాన్విక పుట్టినరోజు పురస్కరించుకొని పాఠశాలలో చదువుతున్న 189 మంది విద్యార్థులకు రూ. 10వేల విలువ గలిగిన తెలుగు, హిందీ, ఇంగ్లిష్ చేతిరాత పుస్తకాలను, క్రీడా సామగ్రిని గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు బాల్‌రెడ్డి, నగేష్, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, నవీన పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం


మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొండపాక, జూన్ 19 : నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొండపాక మండలంలోని వెలికట్ట ఎక్స్ రోడ్ వద్ద బుధవారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు దినేష్ మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దుచేసి పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి బాధితులను చట్టం ప్రకారం శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్ట పరశురాములు, ఎస్సీ సెల్ కొమ్ము మల్లికార్జున్ మాదిగ , కొండపాక మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మెరుగు ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.